

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

అనంతపురం, రాప్తాడు, శింగనమల	:9985411608
తాడిపత్రి,	: 7659062646,
గుంతకల్లు, ఉరవకొండ,	: 9985411657,
కళ్యాణదుర్గం,	:9701120019,
రాయదుర్గం,	: 9000406723,

ఏసీఎం: 9985411154

గూగూడువాసా.. గోవిందా..!



జంట దేవాలయాల ముందు కనులవిందు..

- మార్మోగిన కుళ్లాయిస్వామి నామస్మరణ
- పెద్ద సరిగెత్తుకు పోటెత్తిన భక్త జనం



యువతుల మొక్కులు...



పానకాలు తీసుకెళుతూ..





గూగూడు కుళ్లాయిస్వామి పెద్ద సరిగెత్తు వేడుక మంగళవారం కన్నులపండువగా సాగింది. క్షేత్రంలో కుళ్లాయిస్వామి, ఆంజనేయ స్వామి దర్శనాల కోసం ఉదయం నుంచే భారీ క్యూ లైన్లు ఏర్పడ్డాయి. రాష్ట్ర నలుమూలల నుంచి, తెలంగాణ, కర్ణాటక, గోవా, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు గూగూడుకు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. 'కుళ్లాయి స్వామి గోవిందా.. గోవింద..' అనే నినదాలతో క్షేత్రం మార్మోగుతోంది. మొక్కుబడి ఉన్న కుటుంబాలవారు కాలిన నడకన.. మట్టి కుండల్లో పానకాలను తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. తలనీలాలు సమర్పించి, అగ్ని గుండం చుట్టూ పొర్లు దండాలు పెట్టారు. వాహనాలలో మొద్దులను తీసుకువచ్చి అగ్నిగుండంలో వేశారు. సర్వరోగ నివారణిగా భావించి.. అగ్నిగుండం లోని భస్మాన్ని భక్తులు తమ వెంట తీసుకువెళ్లారు. భక్తుల కోసం గూగూడు మార్గంలో పలువురు అన్నదానం చేశారు. కుళ్లాయిస్వామి పీరును మంగళవారం రాత్రి గ్రామ వీధులలో ఊరేగించారు. గ్రామపెద్దలు రాజన్న, జాఫర్‌వలి, నరసింహులు, దేవదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



పొర్లు దండాలు...

నేడు జలధి

గూగూడు కుళ్లాయి స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం జలధి కార్యక్రమం నిర్వహిస్తామని ఈఓ శోభ తెలిపారు. కుళ్లాయిస్వామి పీరు వెండి గొడుగును బుధవారం తెల్లవారుజామున, సాయంత్రం అగ్నిగుండ ప్రవేశం చేయించి.. గ్రామ సమీపంలోని బావిలో జలధి నిర్వహిస్తామని తెలిపారు.

\- నార్పల



కుళ్లాయిస్వామికి పూజలు చేస్తున్న ముజావర్లు



కుళ్లాయిస్వామీ కాపాడయ్యా...



జై చిరంజీవా..



మొక్కులు తీర్చుకుంటూ..





చిన్నారులు..



కొండపై గుడారాలు..

థ్యాంక్యూ.. వెళ్లొస్తా..!

ఎస్పీ గౌతమి శాలి రిలీవ్.. రేపు కొత్త ఎస్పీ బాధ్యతల స్వీకరణ



మాట్లాడుతున్న ఎస్పీ

అనంతపురం క్రైం, జూలై 16: ఎలాంటి హడావుడి లేకుండా ఎస్పీ గౌతమి శాలి విధుల నుంచి మంగళవారం రిలీవ్ అయ్యారు. ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికేందుకు జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది ఏర్పాట్లు చేయబోయినా.. ఆమె సున్నితంగా తిరస్కరించారు. జిల్లా పోలీసు సిబ్బంది, అధికారులు, ప్రజల సహకారం మరువలేనని ఆమె అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రిలీవ్ అవుతున్న సందర్భంగా పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆమె మంగళవారం మాట్లాడారు. జిల్లాలో ఎస్పీగా అతి తక్కువ కాలం పని చేసినా తనకు సంతృప్తి కలిగిందని అన్నారు. జిల్లా ప్రజలు ముక్కుసూటి కలవారని అన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో ఎస్పీగా బాధ్యతలు చేపట్టినా, పరిస్థితులు చక్కబడేవిధంగా ప్రజలు, పోలీస్ సిబ్బంది తన వెంట నడిచి సహకరించారని అన్నారు. జిల్లా యంత్రాంగం, మీడియా ప్రతినిధులు, పోలీసు సిబ్బంది, రాజకీయపార్టీల నాయకులు, ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. గౌతమి శాలిని విజయవాడ డీసీపీగా ప్రభుత్వం బదిలీ చేసింది. ఆమె స్థానంలో అనకాపల్లి ఎస్పీ కేవీ మురళీకృష్ణను జిల్లా ఎస్పీగా నియమించారు. ఆయన బుధవారం రాత్రికి జిల్లా కేంద్రానికి చేరుకుని, గురువారం బాధ్యతలు స్వీకరిస్తారని తెలిసింది.

ఆలయాలను సందర్శించిన ఎస్పీ



ఆలూరుకోనలో ఎస్పీని ఆశీర్వదిస్తున్న అర్చకులు

తాడిపత్రి: పట్టణంలోని చింతల వెంకటరమణ స్వామి ఆలయాన్ని ఎస్పీ గౌతమిశాలి మంగళవారం సందర్శించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆనందవల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి ఆలూరుకోనకు వెళ్లి శ్రీదేవి భూదేవి సమేత రంగనాథ స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అర్చకులు ఎస్పీని వేదమంత్రాలతో ఆశీర్వదించి, ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని అందించారు. అంతకుమునుపు ఎస్పీకి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎస్పీ వెంట డీఎస్పీ జనార్దన్‌నాయుడు, సీఐలు నాగేంద్రప్రసాద్, లక్ష్మీకాంత్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.



ప్రేమించి.. పెళ్లాడి.. హత్య

- పాత గుంతకల్లులో అమానవీయ ఘటన
- తల్లిని కోల్పోయిన ఐదు నెలల చిన్నారి



పులికొండ, సాయితేజ, చిన్నారి మోక్షశ్రీ (ఫైల్)

గుంతకల్లు టౌన్, జూలై 16: డబ్బు, నగల మీద యావతో ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను కిరాతకంగా చంపేశాడు ఓ వ్యక్తి. గుంతకల్లు పట్టణంలో సోమవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. భార్యను చంపేసిన అనంతరం ఐదు నెలల పసికందుతో పారిపోతుండగా.. స్థానికులు అనుమానించి పట్టుకున్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఈ హత్య గురించి వెలుగులోకి వచ్చింది. పాత గుంతకల్లులోని కనకవీటి వీధికి చెందిన నారాయణస్వామి, రంగమ్మ దంపతులు పండ్ల వ్యాపారం చేస్తుంటారు. వీరికి ఐదుగురు కూతుళ్లు. చిన్న కూతురు సాయితేజ(26) నర్సింగ్ కోర్సు పూర్తి చేసి గుంతకల్లు పట్టణంలో ఓ నర్సింగ్ హోంలో పనిచేసేది. గుత్తి పట్టణంలో ఉన్న తమ బంధువుల ఇంటికి వెళ్లినప్పుడు ఆమెకు బేల్దారి పులికొండ పరిచయమయ్యాడు. క్రమంగా వారి మధ్య ప్రేమ బంధం ఏర్పడి.. రెండేళ్ల క్రితం ఇంట్లోవారికి చెప్పకుండా గుత్తిలోని ఓ దేవాలయంలో పెళ్లిచేసుకున్నారు. ఆ తరువాత గుత్తిలోనే ఓ అద్దె ఇంట్లో నివాసం ఉండేవారు. సాయితేజ ఏడు నెలల గర్భిణీగా ఉన్న సమయంలో ఆమె తల్లిదండ్రులు గుంతకల్లులోని పుట్టింటికి పిలుచుకువెళ్లారు. అది మొదలు డబ్బులు, నగల కోసం భార్యను పులికొండ వేధించడం మొదలు పెట్టాడు. ప్రేమించి పెళ్లి చేసుకున్నందున.. బతుకుతెరువు కోసం డబ్బులు, నగలు కావాలని, గుత్తిలో సాయితేజ తండ్రి పేరిట ఉన్న ఇంటిని తన పేరిట రాయించాలని భార్యతో గొడవ పడేవాడు. ఈ వివాదం నేపథ్యలో గుంతకల్లు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో గతంలో పంచాయితీ జరిగింది. కొన్నాళ్లకు సాయితేజకు కూతురు పుట్టింది. మోక్షశ్రీ అని పేరు పెట్టారు. ప్రస్తుతం పాపకు ఐదు నెలల వయసు. దంపతులిద్దరూ పాత గుంతకల్లు శివాలయం వెనుక ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. రెండు రోజుల క్రితం భర్త గుత్తికి వెళ్లడంతో సాయితేజ తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. పులికొండ సోమవారం రాత్రి 9 గంటల సమయంలో తిరిగొచ్చి.. పుట్టింట్లో ఉన్న భార్య సాయితేజ, పాపను తీసుకుని తన ఇంటికి వెళ్లాడు. డబ్బులు, నగలు, ఇంటి విషయమై రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. విచక్షణ కోల్పోయిన పులికొండ.. సెల్‌ఫోన్ చార్జింగ్ వైరును సాయితేజ గొంతుకు బిగించి హత్య చేశాడు. అంతటితో ఆగకుండా



మృతిచెందిన సాయితేజ

డబ్బు.. నగలు తేలేదని కిరాతకం

కత్తితో ఆమె గొంతు కోశాడు. ఆ తరువాత ఇంటికి తాళం వేసుకుని.. అర్ధరాత్రి 2 గంటల సమయంలో పాపను తీసుకుని పారిపోవాలని చూశాడు. ఆ సమయంలో పసిబిడ్డతో ఉన్న పులికొండను చూసిన స్థానికులు.. పిల్లలను ఎత్తుకెళ్లే దొంగగా భావించారు. అతన్ని పట్టుకుని వివరాలు అడిగారు. సెల్‌ఫోన్‌లో ఫొటో తీసి సాయితేజ తల్లిదండ్రులకు వాట్సప్ చేశారు. వారు వచ్చి ఇంట్లో చూసేసరికి రక్తపుమడుగులో ఉన్న సాయితేజ కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పులికొండను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పాలు తాగని పసిపాప

తల్లి కనిపించకపోవడంతో ఐదు నెలల పసిపాప గుక్కపట్టి ఏడుస్తోంది. తన అవ్వాతాత బయటి పాలు పట్టించాలని చూసినా తాగడం లేదు. దీంతో బంధువులు, కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. పులికొండను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డీఎస్పీ శివభాస్కర్ రెడ్డి, తహసీల్దారు శేషఫణి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతురాలి బంధువుల నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్నారు. మృతురాలి తల్లి రంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గణేష్ తెలిపారు.



కూతురుతో సాయితేజ



అవ్వ,తాతలతో చిన్నారి



ఆసుపత్రి వద్ద రోదిస్తున్న సాయితేజ బంధువులు



Kalyandurgam Municipality

e-procurment - Tender Notice

Tender notice no.01/2024-25/E1, Anna Canteen

Name of scheme	Anna Canteen
No.of Works	1 Nos
Works	Anna Canteen
Total Estimated Amount	38.00 Lakhs
Name and Address of Concerned Officer	Municipal Commissioner, Kalyandurgam Municipality, Kalyanadurgam. (Further Details can be Seen @ e-procurement market place at www.tender.eprocurement.gov.in)

Municipal Commissioner
Kalyandurgam Municipality

జైలు మామిడి స్వాహా.. వైసీపీ నేతపై కేసు

బుక్కరాయసముద్రం, జూలై 16: ఓపెన్ ఎయిర్ జైలు మామిడి పంట తీసుకుని.. డబ్బులు ఎగవేసిన లీజుదారుడు, వైసీపీ నాయకుడు సాంబశివారెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సకాలంలో లీజు డబ్బులను రాబట్టలేకపోయిన ముగ్గురు జైలు సిబ్బందికి రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ హరిష్‌కుమార్ గుప్తా చార్జి మెమోలు జారీ చేశారు. అనంతపురం ఓపెన్‌ఎయిర్ జైలు వ్యవసాయ క్షేత్రంలో 200 ఎకరాల్లో 4,280 మామిడి చెట్లు ఉన్నాయి. వీటి దిగుబడిని బుక్కరాయసముద్రం మండలం నీలంపల్లికి చెందిన వైసీపీ నాయకుడు సాంబశివారెడ్డి పదేళ్లకు లీజుకు దక్కించుకున్నాడు. తొలి ఏడాది (2022) రూ.26.50 లక్షలు చెల్లించేలా, ఆ తరువాత ఏటా ఐదు శాతం ఎక్కువగా చెల్లించేలా లీజు అగ్రిమెంట్ రాసుకున్నారు. తొలి ఏడాది ఆ మొత్తాన్ని చెల్లించాడు. రెండో ఏడాది ఒప్పందం ప్రకారం రూ.27,82,500 చెల్లించాడు. కానీ మూడో సంవత్సరం మామిడి పండ్లను కోసుకువెళ్లి.. లీజు మొత్తం రూ.29,21,625 ఎగవేశాడు. దీంతో జైలు సూపరింటెండెంట్ రెహమాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సాంబశివారెడ్డిపై కేసు నమోదు చేశామని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. జైలర్ మధుసూదన్‌రెడ్డి, డిప్యూటీ జైలర్లు అప్పలరాజు, బాబుకు క్రమశిక్షణ చర్యల కింద చార్జి మెమోలు ఇచ్చారు. అప్పటి జైలు సూపరింటెండెంట్ చిన్నరావు నిర్లక్ష్యం ఉందా? లేదా? అన్న విషయాన్ని విచారించి.. ప్రభుత్వానికి నివేదిక ఇస్తారని తెలిసింది.



వెతలు తొలిగాయ్ !

- సమగ్రశిక్ష ఉద్యోగులకు జీతాల వెలుగు...!
- ప్రాజెక్టు డబ్బులు వాడేసిన గత ప్రభుత్వం
- కేంద్రం ఇచ్చిన బడ్జెట్ దారి మళ్లింపు
- జీతాలు, నిర్వహణ కోసం నిధులు విడుదల
- ఉమ్మడి జిల్లాకు రూ.6.64 కోట్లు
- కూటమి ప్రభుత్వానికి ఉద్యోగుల ధన్యవాదాలు



సమగ్రశిక్ష ప్రాజెక్టు కార్యాలయం



ఆందోళన చేస్తున్న ప్రాజెక్టు ఉద్యోగులు (ఫైల్)

అనంతపురం విద్య, జూలై 16: గత ఐదేళ్లూ కష్టాల చీకట్లలో మగ్గిన సమగ్రశిక్ష ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం వెలుగులు పంచింది. గతంలో కేంద్ర ప్రభుత్వం సమగ్రశిక్ష ప్రాజెక్టులకు ఇచ్చిన డబ్బులను జగన్ ప్రభుత్వం దారి మళ్లించేది. దీంతో జీతాలు ఎప్పుడిస్తారో తెలియని పరిస్థితి. సమగ్రశిక్ష ప్రాజెక్టు పరిధిలో పనిచేసే వేలాది ఉద్యో గులు, అధికారులు గత ఐదేళ్లుగా ఇదే పరిస్థితి ఎదుర్కొన్నారు. కూట మి ప్రభుత్వం కొలువుదీరగానే వేతన బకాయిలు విడుదల చేసింది. ఈక్రమంలోనే ఉమ్మడి అనంత జిల్లాలోని కేజీబీవీల్లో పనిచేసే ఉద్యోగుల జీతాలు, గౌరవ వేతనాలు, ప్రాజెక్టుల నిర్వహణకు ఇటీవల రూ.6.64 కోట్లు మంజూరు చేసింది. దీంతో ఆయా వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ఉద్యోగులను వేధించిన వైసీపీ ప్రభుత్వం

వైసీపీ పాలనలో ఉపాధ్యాయులు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యారు. ఇక కేజీబీవీ ఉద్యోగులంటే మరింత నిర్లక్ష్య భావన ఏర్పడింది. ప్రాజెక్టు నిర్వహణ, ఉద్యోగుల జీతాలకు కేంద్ర ప్రభుత్వం ముందుగానే బడ్జెట్ రిలీజ్ చేస్తుంది. గతంలో కూడా కేంద్రం ఏడాది బడ్జెట్ విడుదల చేసింది. అయితే అప్పటి జగన్ ప్రభుత్వం ప్రతి ఏటా ఈ బడ్జెట్‌ను ఇష్టారాజ్యంగా ఇతర ఖర్చులకు సర్దుబాటు చేస్తూ వచ్చింది. జీతాలు పడాలంటే.. ఉద్యోగులు, మూడు, నాలుగు నెలలు వేచి చూసే పరిస్థితి. ఉద్యోగులు ఆందోళనలు చేస్తే...వేధింపులకు దిగడంతోపాటు, నిర్బంధంగా అణచివేస్తూ వచ్చారు. ఇప్పుడు ఆ బాధలు తప్పాయి.

రూ.6.64 కోట్లు విడుదల

ఉమ్మడి జిల్లాలో 62 కేజీబీవీలు ఉన్నాయి. రెండు జిల్లాల ప్రాజెక్టు ఆఫీసులు, ఎమ్మార్సీ కేంద్రాలు, కేజీబీవీలో సుమారు 2,600 మందికి పైగా అధికారులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. వాళ్లకు రెండు నెలలుగా జీతాలు లేవు. కూటమి ప్రభుత్వం ఉద్యోగులు సమస్యలను గుర్తించి వెంటనే జీతాలు, గౌరవ వేతనాలు, ప్రాజెక్టు నిర్వహణ ఖర్చుల కింద భారీగా నిధులు విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా రూ.51 కోట్లు విడుదల చేసింది. ఈ క్రమంలో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు కలిసి ఏకంగా 6.64 కోట్లు విడుదల చేసింది. దీంతో ఉద్యోగ వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ప్రభుత్వానికి ధన్యవాదాలు



గతంలో కేంద్రం ప్రాజెక్టులకు విడుదల చేసిన బడ్జెట్‌ను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇతర పనులకు మళ్లించేది. ఇటీవలి వరకూ కూడా ఉన్న బడ్జెట్‌ను గత ప్రభుత్వం మళ్లించింది. ఈ క్రమంలో గత రెండు నెలలుగా ఉద్యోగులకు జీతాలు లేక ఇబ్బందులు పడ్డారు. ఇటీవల మంత్రి నారా లోకేశ్ దృష్టికి సమస్యను తీసుకెళ్లాం. ఆయన సానుకూలంగా స్పందించారు. జిల్లాలకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయడం ఆనందంగా ఉంది.

\- విజయ్, సమగ్రశిక్ష ఉద్యోగుల జేఏసీ

జీపీఎస్‌కు బాబు బ్రేకులు

- సీపీఎస్ రద్దు అని చెప్పి జీపీఎస్ తెచ్చిన జగన్ సర్కార్
- ఆగ్రహించిన సంఘాల నేతలు.. బలవంతంగా రుద్దే యత్నం
- బాబు హయాంలో గెజిట్‌కు బ్రేక్.. టీచర్లు, ఉద్యోగుల్లో హర్షం

అనంతపురం విద్య, జూలై 16: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగులకు మేలు చేయడం కోసం సీఎం చంద్రబాబు జీపీఎస్‌కు బ్రేక్ వేసేలా నిర్ణయం తీసుకున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న సుమారు 25 వేల మందికి పైగా ఉపాధ్యాయులు, మరో 15 వేల మందికిపైగా సీపీఎస్ ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సీపీఎస్ రద్దు అని చెప్పి..

2019 ఎన్నికల ముందు వైసీపీ అధినేత జగన్ తమ పార్టీ అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తామని రాష్ట్రంలోని లక్షలాదిమంది ఉద్యోగులు, టీచర్లకు హామీ ఇచ్చారు. అయితే ఏళ్లు గడిచాయి కానీ హామీ అమలు కాలేదు. దీనిపై ఉద్యోగులు భగ్గుమన్నారు. ఆందోళనలు చేశారు. ఈక్రమంలో ప్రతి ఏటా సెప్టెంబరు 1న నిర్వహించే సీపీఎస్ విద్రోహ దినాన నిరసనలు తెలిపిన సీపీఎస్ ఉపాధ్యాయులు, ఉద్యోగులపై కేసులు కూడా పెట్టారు. ఈక్రమంలోనే గ్యారెంటీ పెన్షన్ స్కీం(జీపీఎస్)ను తీసుకొచ్చారు. దీనిపైనా సంఘాల నేతలు, ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా గత ప్రభుత్వం జీపీఎస్ అమలుకు కసరత్తు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక 2023 అక్టోబరు 20 నుంచి జీపీఎస్ అమలు అన్నట్టుగా ఆర్థిక శాఖ ప్రధాన ఉన్నతాధికారి పేరుతో ఉత్తర్వులు బయటకు వచ్చాయి. దీంతో ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఉలిక్కిపడ్డారు. ఈ విషయం సీఎం దృష్టికి వెళ్లడంతో ఆయన ఆగమేఘాల మీద జీపీఎస్ జీవోకు బ్రేక్ వేయాలంటూ అధికారులను ఆదేశించారు. దీంతో ఉద్యోగుల్లో సంతోషం నెలకొంది.

నిలిపివేయడం ఆనందదాయకం



గత ప్రభుత్వం జీపీఎస్‌పై తీసుకున్న నిర్ణయాన్ని నిలిపివేయడం ఆనందకరంగా ఉంది. భవిష్యత్తులో సీపీఎస్ రద్దు చేయడానికి కూడా మార్గం సుగమం అయినట్లయింది. దూరదృష్టి, అనుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్యోగుల పక్షాన మంచి నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నాం. ఉద్యోగులు మానసిక ఒత్తిడికి దూరమైతే సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర వహిస్తారు.

\- ఎర్రిస్వామి, ఆర్‌యూపీపీ, రాష్ట్ర సహాధ్యక్షుడు

అందరిలో హర్షం



ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీపీఎస్ గుదిబండగా ఉండేది. దాని స్థానంలో గత ప్రభుత్వం జీపీఎస్ తీసుకొచ్చి మరింత ఇబ్బంది పెట్టింది. అయితే మునుపటి ప్రభుత్వ నిర్ణయాన్ని కొనసాగించేలా ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు కొత్త ప్రభుత్వానికి తెలియకుండా గెజిట్ విడుదల చేస్తే, దానికి సీఎం చంద్రబాబు బ్రేక్ వేశారు. దీని పట్ల అందరిలో హర్షం వ్యక్తమవుతోంది.

\- రామాంజనేయులు, జిల్లా ప్రధానకార్యదర్శి, ఎస్టీయూ

ఏకాదశి ఉత్సవాలు ప్రారంభం



పాదయాత్రతో వస్తున్న మరాఠా భక్తులు

పుట్టపర్తి, జూలై 16: ప్రశాంతి నిలయంలో మంగళవారం ఆషాఢమాస ఏకాదశి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయికుల్వంతు మందిరంలో వేదపఠనంతో వేడుకలు మొదలయ్యాయి. అనంతరం గంట పాటు సత్యసాయి ప్రేమతత్వంపై భక్తిగీతాలాపన చేశారు. సాయంత్రం హర్షవర్ధన్ బృందం సంగీత గానకచేరిని నిర్వహించారు. మధురమైన వాయిద్య, గానంతో భక్తులను మైమరిపించారు. ఈ సందర్భంగా సాయికుల్వంతు మందిరాన్ని ప్రత్యేకంగా అలంకరించారు.

పాదయాత్రతో పుట్టపర్తికి చేరిన మరాఠా భక్తులు

ప్రతి ఏడాది మరాఠా భక్తులు ఆషాఢ ఏకాదశి ఉత్సవాలలో పాల్గొనడం ఆనవాయితీగా వస్తోంది. వీరు మహారాష్ట్ర నుంచి రైలుమార్గాన ధర్మవరం చేరుకున్నారు. అక్కడి నుంచి పాదయాత్రగా మంగళవారం రాత్రి ప్రశాంతి నిలయం చేరుకున్నారు. బుధవారం ప్రశాంతి నిలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.



సాయి గీతాలను ఆలపిస్తున్న భక్తులు

కర్షకుడిని కాటేసిన కరెంటు

పంటకి నీరు పెట్టేందుకు వెళ్లి విద్యుత్ షాక్‌తో యువరైతు మృతి



రోదిస్తున్న కుటుంబ సభ్యులు, ఇన్‌సెట్‌లో చాకలి దేవరాజు ఫైల్‌ఫొటో

కుందుర్పి, జూలై 16: కరెంటు కాటుకు మండలంలోని బెస్తర పల్లికి చెందిన యువరైతు చాకలి దేవరాజు (36)మంగళవారం బలి అయ్యాడు. కుటుంబ సభ్యు లు, పోలీసులు తెలిపిన మేరకు... చాకలి దేవరాజు కులవృత్తి చేసుకుంటూనే వ్యవసాయం చేసేవాడు. బెస్తర్లపల్లికి చెందిన ఆనంద్‌తో రెండున్నర ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని గత రెండేళ్లుగా వ్యవసాయం చేస్తున్నాడు. పది రోజుల కిందట కౌలుకు తీసుకున్న పొలంలో డ్రిప్ ద్వారా మొక్కజొన్న సాగు చేశాడు. రోజూలాగానే మంగళవారం ఉదయం కూడా మొక్కజొన్నకు నీరు పెట్టేందుకు తోటకు వెళ్లి మోటారు ఆన్ చేశాడు. అనంతరం స్టార్టర్ బాక్స్ మూత వేస్తుండగా దానికి విద్యుత్ సరఫరా అయ్యి షాక్ కొట్టింది. దీంతో దేవరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. పక్క తోటలో పనిచేసే కూలీలు దీన్ని గమనించి గట్టిగా కేకలు వేసుకుంటూ అక్కడికి వచ్చారు. పరిశీలించగా అప్పటికే చాకలి దేవరాజు మృతి చెందాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు ట్రాన్స్‌కో అధికారులు కూడా సంఘటనా స్థలాన్ని పరిశీలించి విద్యుత్ షాక్‌తోనే రైతు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య గంగమ్మ, ఐదో తరగతి చదువుతున్న కుమారుడు మౌర్య, రెండో తరగతి చదువుతున్న కూతురు లిఖిత ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అసైన్డ్ అమ్మకాలు..!

- కసాపురంలో వైసీపీ నాయకుల దందా
- లే అవుట్లు వేయకుండా ప్లాట్ల విక్రయం
- గుట్టను కబళించినా పట్టని అధికారులు



201-బీ సర్వే నెంబరులో గుట్టపైన తవ్వి చదును చేసిన దృశ్యం

గుంతకల్లు, జూలై 16: వైసీపీ అధికారం కోల్పోయి నెల గడిచినా.. ఆ పార్టీ నాయకుల కబ్జాల పర్వం ఆగడం లేదు. దోనిముక్కల రోడ్డులో ఖాళీ స్థలాలను ఆక్రమిస్తున్నారు. కసాపురం గుట్టపై కన్నేశారు. పెద్ద గుట్టను చదనుచేసి ప్లాట్లుగా మారుస్తున్నారు. కసాపురంలో ప్రభుత్వం పంపిణీ చేసిన అసైన్డు భూములను అమ్మి సొమ్ము చేసుకునే పనిలోపడ్డారు. ప్రభుత్వ భూమిలో లే అవుట్ వేయకుండా.. ఎవరికి ఎన్ని సెంట్లు కావాలో మాట్లాడుకుని.. అగ్రిమెంట్లపై అమ్ముకుంటున్నారు. ఆలస్యం చేస్తే స్థలాలు చేజారి పోతాయని యంత్రాలు పెట్టి మరీ గుట్టను చదునుచేసి అమ్మేస్తున్నారు.

అసైన్డు భూములే టార్గెట్

కసాపురంలో రహదారికి ఇరువైపులా అసైన్డు భూములు ఉన్నాయి. లబ్ధిదారులకు అంతో ఇంతో ఇచ్చి ఆ భూములను వైసీపీ నాయకులు కొంటున్నారు. వాటిని ప్లాట్లుగా మార్చి అమ్మేస్తున్నారు. కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి చెందిన పీఎస్‌సీ వసతి గృహానికి సమీపంలో పడమటి రోడ్డుకు ఆవల ఉన్న గుట్టను కరిగించి ప్లాట్లుగా మార్చేస్తున్నారు. సాధారణంగా ప్లాట్లు అమ్మాలంటే మొదట లే అవుట్ వేస్తారు. హద్దు రాళ్లను పాతి అమ్మకాలు మొదలు పెడతారు. కానీ కసాపురంలో గంపగుత్తగా అమ్మేస్తున్నారు. సెంటు రూ.50 వేలు, రూ.60 వేల ప్రకారం.. ఎవరికి ఎన్ని సెంట్లు కావాలంటే అన్ని సెంట్లు కొలిచి ఇస్తున్నారు. కసాపురంలో రోడ్ల పక్కన ప్రైవేటు భూమి ఎకరా రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్లదాకా రేటు పలుకుతోంది. అటువంటిది సెంటు కేవలం రూ.50 వేలకు దొరుకుతుండటంతో హాట్ కేకుల్లా అమ్ముడౌతున్నాయి. కసాపురం గ్రామానికి చెందిన డి.పుల్లన్న అనే రైతుకు సర్వే నంబరు 201-బీలో 5.20 ఎకరాల భూమి ఉంది. దీన్ని ఆయన ఇద్దరు కొడుకులు చెరి సగం పంచుకున్నారు. అందులో తన వాటాగా వచ్చిన 2.60 ఎకరాలను పుల్లన్న కుమారుడు సుంకన్న వైసీపీ నాయకులకు అమ్మేశారు. దాన్ని వైసీపీ నాయకులు ప్లాట్లుగా విడగొట్టి విక్రయిస్తున్నారు.

అమ్మకానికి మరిన్ని..

కసాపురం పరిధిలో అత్యంత విలువైన అసైన్డు భూములను కొందరు కొనుగోలు చేసి.. లే అవుట్లు వేసేపనిలో పడ్డారు. బుగ్గసంగాల వద్ద ఉన్న సర్వే నంబరు 8లో రెండెకరాల పైచిలుకు భూమిని, కసాపురం ఆలయానికి ఆవల మూతబడిన టైర్ల ఫ్యాక్టరీ వద్ద ఉన్న 278 సర్వే నంబరులో 4 ఎకరాల అసైన్డు భూమిని కొందరు కొని.. ప్లాట్లు వేస్తున్నారు. కసాపురం శివారులో.. గుంతకల్లు రోడ్డులోని 270-ఏ సర్వే నంబరులో దాదాపు మూడున్నర ఎకరాల అసైన్డు భూమిని గతంలో వైసీపీ నాయకులు ఆక్రమించారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. అక్కడ ప్లాట్లు వేయరాదని హెచ్చరిస్తూ బోర్డులు పెట్టారు. ఆ తర్వాత బోర్డులను తొలగించి ప్లాట్లు వేసి అమ్మేశారు. సెంటు రూ.6 లక్షల ప్రకారం అమ్మేసి.. సొమ్ము చేసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చే ఇంటి స్థలాలు సెంటు లేదా, ఒకటిన్నర సెంటు, మహా అయితే రెండు సెంట్ల ప్లాట్లు ఉంటాయి. కానీ ఈ సర్వే నంబరులో రోడ్డుకు ఇరువైపులా భారీ ఇళ్లను నిర్మిస్తున్నారు.



గుట్ట కింద ఎక్స్‌కవేటరుతో నేలను చదను చేసి అమ్మకానికి సిద్ధంచేసిన దృశ్యం

అధికారుల మీనమేషాలు

కసాపురంలో వైసీపీ నాయకుల దందా గురించి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా చర్యలు తీసుకోవడం లేదు. ఎన్నికల డెప్యుటేషన్ పూర్తయితే బదిలీపై వెళ్లిపోతామని.. తమకెందుకు ఈ గొడవలన్నీ అన్నట్లు కాలయాపన చేస్తున్నారు. కసాపురంలోని 201-బీ సర్వే నంబరులో ఆక్రమణలను తహసీల్దారు శేషఫణి వెళ్లి పరిశీలించారు. కానీ చర్యలు తీసుకోలేదు.

గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైలు

గుంతకల్లు, జూలై 16: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బెంగళూరు-కలబురగి మధ్య (వయా గుంతకల్లు) ఓ అప్ అండ్ డౌన్ ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు-కలబురగి ప్రత్యేక రైలు (నెం. 06533) ఈ నెల 19 రాత్రి 8 గంటలకు బెంగళూరులో బయలుదేరి శనివారం తెల్లవారుజాము 12-40 గంటలకు అనంతపురం చేరుకుని, గుంతకల్లుకు ఉదయం 2-05 గంటలకు వచ్చి, కలబురగి స్టేషన్‌కు ఉదయం 7-45 గంటలకు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 06534) కలబురగిలో 20న ఉదయం తొమ్మిదిన్నరకు బయలుదేరి గుంతకల్లుకు మధ్యాహ్నం 2 గంటలకు, అనంతపురం మధ్యాహ్నం 3-07 గంటలకు వస్తుందని, బెంగళూరుకు అదే రోజు రాత్రి ఎనిమిదిన్నరకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు యల్హంక, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, యాద్గిర్, షాహాబాద్ స్టేషన్ల మీదుగా వెళ్తుందని తెలియజేశారు.

అపహాస్యం చేసేలా సీఓపీ నిబంధనలు

- జిల్లా బార్ అసోసియేషన్

అనంతపురం క్రైం, జూలై 16: బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సీఓపీ (సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్) నిబంధనలు న్యాయవాద వృత్తిని అపహాస్యం చేసేలా ఉన్నాయని బార్‌అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గురుప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈ మేరకు వారు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా 2015 నోటిఫికేషన్ ఆధారంగా 35 క్లాజ్‌ను పరిశీలించిన మేరకు ప్రాసెసింగ్, వెరిఫికేషన్ ఫీజును నిర్ణయించిందన్నారు. అందులో భాగంగా 20శాతం బార్ కౌన్సిల్ ఆఫ్ స్టేట్, డిస్ట్రిక్ట్‌కు వెనక్కు ఇవ్వకపోగా బార్‌కౌన్సిల్ నిర్ణయించిన సీఓపీ కాల పరిమితి ముగిసినప్పటికీ, కార్డులు ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం అదనంగా రూ.500లు నిర్ణయించిందన్నారు. ఐదేళ్లలో ప్రతి న్యాయవాది ప్రాక్టీస్‌లో ఐదు కేసులకు తక్కువ కాకుండా వారి జడ్జిమెంట్ కాపీలు లేదా వకాల్తా కాపీలు, సర్టిఫికెట్లు సీఓపీకి అనుసంధానం చేసి పంపాలని నిర్ణయించడం, వారి వృత్తిపై నమ్మకం సన్నగిల్లేలా చేస్తోందన్నారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తీర్మానాలకు వ్యతిరేకంగా అనంతపురం బార్ అసోసియేషన్ 18, 19, 22తేదీల్లో నిరసన తెలియజేస్తుందన్నారు. అందులో భాగంగా కోర్టు విధులను బహిష్కరిస్తామని స్పష్టం చేశారు.

అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, జూలై 16: జాతీయ స్థాయి ఉత్తమ టీచర్ అవార్డులు-2024కు అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 21వ తేదీ వరకూ అవకాశం ఉందని డీఈఓ వరలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్య ప్రైమరీ, అప్పర్‌ప్రైమరీ, హైస్కూళ్లలో పనిచేసే టీచర్లు, ప్రధానోపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేయాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన తర్వాత, వాటిని ధ్రువీకరణ అధికారితో ధ్రువీకరించి డీఈఓ ఆఫీస్‌లో అందజేయాలన్నారు.

చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం రూరల్, జూలై 16: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.13వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 398 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై 16: ఉమ్మడి అనంతపురం జిల్లాలో దివ్యాంగులైన విద్యార్థులు కేంద్ర ప్రభుత్వం అందించే ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల ఉమ్మడి అనంత జిల్లా ఏడీ అబ్దుల్ రసూల్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 9, 10 తరగతులు, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, పీజీ ఆపై చదువులు చదువుతున్న దివ్యాంగులు www.scholarships.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. 9, 10 తరగతుల విద్యార్థులు ఆగస్టు 31, ఇంటర్ ఆపై తరగతుల విద్యార్థులు అక్టోబరు 31 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

1300 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా

అనంతపురం అర్బన్, జూలై 16 : జిల్లాకు 1300 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ రవి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో అమ్మోనియం సల్ఫేట్ 1000 మెట్రిక్ టన్నులు, 20-20-0-13 రకం ఎరువులు 300 మెట్రిక్ టన్నులు వచ్చినట్లు వెల్లడించారు.

తుంగభద్రలో మరో రెండు టీఎంసీల చేరిక



బొమ్మనహాళ్, జూలై 16: తుంగభద్ర జలాశయంలోకి మరో రెండు టీఎంసీల నీరు చేరింది. దీంతో నీటి నిల్వ 35.473 టీఎంసీలకు చేరింది. సోమవారం 16,142 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో మంగళవారం ఉదయానికి 36,170 క్యూసెక్కులకు పెరిగింది. బుధవారం ఉదయానికి 50 వేల క్యూసెక్కులకు పెరిగే అవకాశం ఉన్నట్లు బోర్డు అధికారులు వెల్లడించారు. తుంగభద్ర జలాశయం పరివాహక ప్రాంతాలుశివమొగ్గ, శృంగేరి తదితర ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తుండటంతో తుంగభద్రకు మంగళవారం వరద ఊపందుకుంది.

పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి కృషి చేయండి

పీసీసీ మాజీ అధ్యక్షుడు శైలజానాథ్



మాట్లాడుతున్న పీసీసీ మాజీ అధ్యక్షుడు శైలజానాథ్

కళ్యాణదుర్గం, జూలై 16: పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి వెనుకబడిన అనంతపురం జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం ఆయన నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాంభూపాల్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక నిధులు రావాల్సి ఉందని, వాటిని కేంద్ర ప్రభుత్వం పక్కన పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకాన్ని ముందుకు తీసుకెళ్లకపోవడం బాధాకరమన్నారు. ప్రాజెక్టు అనంతను పక్కన పెట్టేశారని, జిల్లా కేంద్రంలో సెంట్రల్ యూనివర్సిటీ నిర్మాణం మొండి గోడలకే పరిమితమైందన్నారు. ప్రత్యేక హోదా సాధన కోసం, కడప, ఉక్కుఫ్యాక్టరీ సాధన కోసం ప్రజాప్రతినిధులు పోరాటం చేయాలన్నారు. కళ్యాణదుర్గం ప్రాంతంలో రైల్వేలైన్, హంద్రీనీవా పథకాన్ని జీడిపల్లి వరకు తీసుకువచ్చిన ఘనత నాటి కాంగ్రెస్ మంత్రి రఘువీరారెడ్డికే దక్కిందన్నారు. అనంతపురం జిల్లాలో వర్షాభావం నెలకొన్న నేపథ్యంలో అన్నదాతలను తక్షణం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని తాగు, సాగునీటి అవసరాలకు రిజర్వాయర్‌లో నీటి నిల్వలు ఉంచుకోవాలన్నారు. తెలుగుదేశం పార్టీ ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చాలని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో జిల్లా ప్రజా ప్రతినిధులు ఇక్కడి సమస్యలను ప్రస్తావించి అధిక నిధులు తీసుకురావాలని, ఇందుకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ చొరవ చూపాలని సూచించారు. నాయకులు తిమ్మప్ప, మాల యర్రిస్వామి, తిమ్మరాజు, బలరామిరెడ్డి, గోవిందప్ప, పరమేశ్వరప్ప, ఈశ్వర్, నాగరాజు, సోమశేఖర్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ద్వారా మిమ్ములను అభిమానించే వారికి శ్రేయోభిలాషులకు, మిత్రులకు శుభాకాంక్షలు తెలియజేయండి.
Advertisements
జన్మదిన వేడుకలు | వివాహ శుభాకాంక్షలు
విదేశీయాన శుభాకాంక్షలు | స్వదేశాగమన శుభాకాంక్షలు
ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు | మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనలకు మీ ఏరియాలోని మా ప్రతినిధిని సంప్రదించండి
యాడ్స్ డిపార్ట్‌మెంట్ : 99854 11165, 99854 11179, 9900167475,
ప్రతి ప్రకటనలపై GST 5% వర్తించబడును.
అనంతపురం : 99854 10956, 99854 01243, 99854 01208, 99854 01251, 99854 03749, 77804 27767
గుంతకల్లు : 89195 18075,
హిందూపురం : 97036 18698,
లేదా మీ సమీప ఆంధ్రజ్యోతి ఏజెంటును సంప్రదించండి.

ఆంధ్రజ్యోతి సండే క్లాసిఫైడ్స్ SUNDAY CLASSIFIEDS

బంగారం కొనబడును



మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్రః 7382114647
AJA- 189272

గాయత్రి జ్యోతిష్యం

పండిట్ ఎస్.వి.శాస్త్రిగారు 50సం॥లుగా ఆంధ్ర, కర్నాటకలో ప్రసిద్ధి చెందినారు. విద్య, స్త్రీ పురుష ప్రేమ, లగ్నం, సంతానం, వ్యాపార ఆర్థిక కుటుంబ సమస్యలకు సంప్ర. 9440532926
AJA-189190

CHANGE OF NAME

I SANE ANASUYA (Old Name) W/o Sane Nagi Reddy, H.No.7-385, Eguvagadda, Penukonda, Sri Sathya Sai (Dt) A.P., Changing my name from SANE ANASUYA (Old Name) to SANE ANASUYAMMA (new Name) Hence forth i am being called as SANE ANASUYAMMA for all purposes.
AJA-189495

వర్కర్స్ కావలెను

ప్రముఖ హోటల్ నందు పనిచేయుటకు వర్కర్స్ కావలెను. ఉచిత భోజనం, వసతి కలదు. ఆకర్షణీయమైన జీతం. సెల్ : 96665 33244
Ajc-188780

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆదరణ చిట్స్ బాధితుల ఆందోళన



న్యాయసేవా సదన్ వద్ద ఆందోళన చేస్తున్న ఆదరణ బాధితులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 16: తమకు న్యాయం చేయాలని ఆదరణ చిట్స్, సొసైటీ బాధితులు ఆందోళన నిర్వహించారు. మంగళవారం స్థానిక జిల్లా కోర్టు ఆవరణంలోని జిల్లా న్యాయసేవాసదన్ వద్ద వందలాది మంది ఆదరణ చిట్స్, సొసైటీ బాధితులు నిరసన చేపట్టారు. సుమారు 800మంది బాధితులు ఆదరణ చిట్స్, సొసైటీలలో ఖాతాదారులకు చేరామని, మొత్తం రూ.100కోట్ల వరకు తమకు రావాలని వాపోయారు. జిల్లా జడ్జిలు ఆదరణ బాధితులతో మాట్లాడారు. ఆదరణ రామకృష్ణను పిలిపించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఒక లేఖను రాసి వారికి ఇచ్చారు. ఆరు నెలల్లో ఆస్తులను అమ్మి అందరికీ పైసాతో సహా చెల్లిస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని లేఖలో పేర్కొన్నారు. ఆస్తులు అమ్మడానికి అవకాశం కల్పించాలని, సీజ్ చేసిన బ్యాంకు ఖాతాలను ఓపెన్ చేయాలని కోరారు. అనంతరం బాధితులు జిల్లా న్యాయసేవాసదన్‌కు పేర్ల వివరాలను అందజేశారు.

మైనార్టీ కాలనీలో వీధిలైట్ల ఏర్పాటు

రాప్తాడు, జూలై 16: రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు రాప్తాడు గ్రామ పంచాయతీ పరిధిలోని మైనార్టీ కాలనీలో టీడీపీ సర్పంచ్ సాకే తిరుపాలు మంగళవారం వీధిలైట్లు ఏర్పాటు చేయించారు. ఎన్నికల ప్రచార సమయంలో వీధిలైట్లు వేయించాలని కాలనీవాసులు పరిటాల సునీతను కోరారు. సమస్యను పరిష్కరిస్తానని పరిటాల సునీత వారికి హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో వీధిలైట్లను ఏర్పాటు చేయించారు.

నెల్లూరుపై జిల్లా బాలుర జట్టు విజయం



సాత్విక్ / వరుణ్ నాయుడు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 16: నెల్లూరుపై జిల్లా బాలుర జట్టు విజయం సాధించింది. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అండర్-16 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు విజయనగరంలో నిర్వహించారు. అనంతపురం, నెల్లూరు జట్ల మధ్య పోటీసాగగా అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 28.3ఓవర్లలో 91పరుగులకు ఆలౌట్ అయ్యింది. నెల్లూరు మొదటి ఇన్నింగ్స్‌లో 63.4ఓవర్లలో 183పరుగులకు ఆలౌట్ అయ్యింది. జిల్లా బౌలర్ వరుణ్ సాయి నాయుడు 6వికెట్లు తీశాడు. రెండో ఇన్నింగ్స్‌లో అనంతపురం 54.4ఓవర్లలో 273పరుగులకు ఆలౌట్ అయ్యింది. సాత్విక్ 135పరుగులు చేశాడు. నెల్లూరు రెండో ఇన్నింగ్స్‌లో 45.3ఓవర్లలో 151పరుగులు చేసింది. దీంతో అనంతపురం జట్టు 32పరుగుల తేడాతో విజయం సాధించింది.

స్కూల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 16: జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో స్కూల్ క్రీడాకారుల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. క్రికెట్ సంఘం జిల్లా కార్యదర్శి మధు ఆచారి మంగళవారం ఆర్డీటీ స్టేడియంలో టోర్నీని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాల స్థాయి విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి పెంచడం కోసం టోర్నీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుమారు 10జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు ప్రవీణ్, మధుసూదన్ నాయక్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా క్రికెట్ పోటీల్లో పలుజట్ల విజయం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 16: మహిళా క్రికెట్ పోటీల్లో చిత్తూరు, సౌత్, నార్త్ జోన్ జట్లు విజయం సాధించాయి. మంగళవారం స్థానిక అనంత క్రీడాగ్రామం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, జిల్లా క్రికెట్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సీనియర్ మహిళా జోనల్ క్రికెట్ పోటీలు జరిగాయి. కృష్ణా, చిత్తూరు జట్లు తలపడగా కృష్ణా జట్టు 41 ఓవర్లలో 3 వికెట్లకు 168 పరుగులు చేసింది. చిత్తూరు 41 ఓవర్లలో 169 పరుగులు చేసి విజయం సాధించింది. పద్మజ 61 పరుగులు, 2 వికెట్లు తీసి ఆల్‌రౌండ్‌షోతో ఆకట్టుకుంది. మరో మ్యాచ్‌లో విశాఖపట్నం, సౌత్‌జోన్ జట్లు పోటీపడ్డాయి. విశాఖపట్నం 47 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బరిలోకి దిగిన సౌత్‌జోన్ 41.3 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 197 పరుగులు చేసి 3 వికెట్ల తేడాతో గెలుపొందింది. అనూషా 115 పరుగులు చేసింది. సెంట్రల్‌జోన్, నార్త్ జోన్ జట్లు పోటీ పడగా సెంట్రల్ జోన్ 25ఓవర్లలో 98పరుగులకు ఆలౌట్ అయ్యింది. నార్త్ జోన్ 22.4ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది.

20 నుంచి హాస్టళ్ల సందర్శన

అనంతపురం విద్య, జూలై 16: రాష్ట్రవ్యాప్తంగా హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల గుర్తింపు కోసం 20వ తేదీ నుంచి 30వ తేదీ వరకు హాస్టళ్ల సందర్శన చేయనున్నట్టు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణయ్య, జిల్లా ప్రధానకార్యదర్శి కుల్లాయిస్వామి తెలిపారు. మంగళవారం ఆ సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 26 జిల్లాల్లోని హాస్టళ్లల్లో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థుల సమస్యలను దగ్గరుండి తెలుసుకోవాలన్న ఉద్దేశంతో హాస్టళ్లను సందర్శిస్తామన్నారు. సమస్యలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు మంజునాథ్, వంశీ, హరికృష్ణ, ఆనంద్, సమీర్, పవన్, నాని, మన్సూర్, శంకర్, ఇమారాన్, కార్తీక్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చెట్లు నరికి ఇబ్బందిపడద్దు

అనంతపురం న్యూటౌన్, జూలై 16: మొహరం సందర్భంగా అనుమతి లేకుండా చెట్లు నరికి ఇబ్బందులు పడవద్దని అటవీశాఖ సిబ్బంది వడ్డుపల్లి బీట్‌లోని ఆత్మకూరు పరిసర ప్రాంత ప్రజలకు అవగాహన చేపట్టారు. స్థానిక సెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ స్థానికులతో సమావేశం నిర్వహించి చెట్లను నరకవద్దన్నారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ జగదీష్ యాదవ్‌తోపాటు స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ సమాధి సందర్శన

అనంతపురం అర్బన్, జూలై 16: నాగపూర్‌లోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సమాధిని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మంగళవారం సందర్శించారు. ఇతర జిల్లాల ఎమ్మెల్యేలు, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటప్పతో కలిసి ఆయన సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు.



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మొక్కలునాటి సంరక్షించండి



మొక్కకు నీరు పోస్తున్న కలెక్టర్

నార్పల, జూలై 16: మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. నార్పలలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణంలో హరిత అనంత ప్లాంటేషన్‌లో భాగంగా మంగళవారం కలెక్టర్ మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాటిన మొక్కలను మహావృక్షాలు అయ్యేందుకు శ్రమించాలన్నారు. అప్పుడే ఆహ్లాద వాతావరణం సాధ్యమన్నారు. భవిష్యత్ తరాలకు మనం చేసే మేలు ఇదేనన్నారు. నార్పల నుంచి కేశేపల్లి పంచాయతీకి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటారు. కార్యక్రమంలో డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, ఏపీడీ అనురాధ, ఏపీఓ రమేష్, ఎంపీడీఓ రాముడు, కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ డెవిడ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

అనంతపురం సెంట్రల్, జూలై 16: ప్రధాని నరేంద్రమోదీ 'ఏక్ పేడ్ మాకేనామ్' పిలుపు మేరకు ఆర్ట్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ విష్ణుప్రియ ఆధ్వర్యంలో కురుగుంట గురుకుల బాలయోగి జూనియర్ కళాశాలలో రావి, నేరేడు, జామ, వేప, కానుగ మొక్కలు నాటారు. అనంతరం గ్రామంలో మొక్కలు పంపిణీచేసి పర్యావరణంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఏ మల్లికార్జున, ప్రిన్సిపాల్ ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే భావితరాలకు భద్రత



మొక్క నాటుతున్న శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం

అనంతపురం విద్య, జూలై 16: మొక్కల పెంపకంతోనే భావితరాల భవిష్యత్తుకు రక్షణ సాధ్యమని శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని కమ్మభవన్ వద్ద ఉన్న శ్రీచైతన్య స్కూల్‌లో జరిగిన గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు, ప్రిన్సిపాళ్లతో కలసి మొక్కలు నాటారు. తర్వాత చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు విశ్వనాథ్, కోఆర్డినేటర్ రాధాకృష్ణ, డీన్‌లు రిషిబాల, ముత్యాలన్న, టెన్త్ ఇన్‌చార్జ్ సతీష్ పాల్గొన్నారు.

పచ్చదనంతో ఆహ్లాదం: ఎంపీడీఓ



గుమ్మేపల్లిలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ

శింగనమల జూలై 16: పచ్చదనంతో ఆహ్లాదం సాధ్యమని ఎంపీడీఓ వెంకటరమణ, సర్పంచ్ లలితమ్మ అన్నారు. గుమ్మేపల్లిలో మొక్కలను నాటిన అనంతరం వారు మాట్లాడారు. ప్రతిఒక్కరూ మొక్కలను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి, ఏపీఓ శ్రీదేవి, ఈసీ దామోదర్ పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణతోనే పర్యావరణ సమతుల్యత

అనంతపురం న్యూటౌన్: మొక్కల సంరక్షణతోనే పర్యావరణ సమతుల్యత సాధ్యమని అటవీశాఖ అధికారులు అన్నారు. స్థానిక దుర్గం బీట్‌లోని ఆర్డీటీ స్కూల్ ఆవరణంలో మంగళవారం మొక్కలు నాటారు. స్థానిక బీట్ ఆఫీసర్ మారెప్ప ఆధ్వర్యంలో చేపట్టారు. స్థానిక సిద్దరామచర్ల సర్పంచ్ రామాంజినేయులు మొక్కలు నాటారు.

మానవ మనుగడకు మొక్కలే ఆధారం



మొక్కలు నాటుతున్న టీడీపీ నాయకులు, అధికారులు

అనంతపురంరూరల్, జూలై 16: మానవ మనుగడకు మొక్కల పెంపకం చాలా అవసరమని టీడీపీ మాజీ మండల కన్వీనర్ లక్ష్మీనారాయ అన్నారు. మంగళవారం మండలంలోని కురుగుంట గ్రామంలో అవెన్యూ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మొక్కల పెంపకం ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఏపీఓ చంద్రకళ, డాక్టర్ మనోజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి హిదయతుల్లా, రాప్తాడు నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షుడు నారాయణస్వామి, గ్రామ కమిటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, నాయకులు వెంకట్‌రాముడు, దండోర రమణ, జయరాములు, ధర్మేంద్ర పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించండి: ఎంపీడీఓ

రాప్తాడు, జూలై 16: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీఓ గీతావాణి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ ఓబన్న, మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్‌లు తిరుపాలు, శీనయ్య పాల్గొన్నారు.



ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ, టీడీపీ నాయకులు

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ఎమ్మెల్యే బండారు శ్రావణి

నార్పల, జూలై 16: బాలికపై అత్యాచారయత్నానికి యత్నించిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. అత్యాచారయత్నానికి గురైన బాలిక ఇంటికి మంగళవారం ఎమ్మెల్యే వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. టీడీపీ నాయకుడు ఆలం వెంకటనరసానాయుడు, విజయ్‌కుమార్, చంద్రబాబు, ఆకుల అనిల్, ఆకుల తేజ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

రేషన్ దందాపై చర్యలు తీసుకోండి


డీఎస్ఓ, ఆర్డీఓలకు ఫిర్యాదు

అనంతపురం టౌన్, జూలై 16: చౌకబియ్యం దందాపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అవినీతి వ్యతిరేకపోరాట కమిటీ, సమాచారహక్కు ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆ సంఘాల నాయకులు లాల్యానాయక్, రాయల్‌కొండయ్య, శ్రీనివాసులుగౌడ్, చంద్రశేఖర్, హరిణి, చంద్రమహేష్ తదితరులు డీఎస్ఓ, ఆర్డీఓ కార్యాలయాలకు వెళ్లి చౌకబియ్యం దోపిడీపై ఆధారాలతో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నగరంలో 137 చౌకడిపోలు ఉంటే అందులో 80 షాపుల్లో ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు 2,12లక్షల కేజీల బియ్యం మాయమైందన్నారు. ఈనెల 16వ తేదీ కావస్తున్నా ఇప్పటికీ ఇంకా సగం మంది కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయలేదన్నారు. ఒక్క అనంతపురంలోనే ఈస్థాయిలో ఇలా ఉంటే జిల్లాస్థాయిలో ఇంకెంత బియ్యం దోపిడీ జరుగుతోందో అధికారులు ఆలోచించాలన్నారు. బియ్యం అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ డీఎస్ఓ, ఆర్డీఓ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు.

రమేష్ సేవలు చిరస్మరణీయం

వర్ధంతిలో ఉపాధ్యాయ సంఘం నాయకులు

అనంతపురం విద్య, జూలై 16: ఉపాధ్యాయ ఉద్యమ నేత రమేష్ సేవలు చిరస్మరణీయమని ఉపాధ్యాయ సంఘాల నేతలు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక 15వ వార్డు నగర పాలక ప్రాథమికోన్నత పాఠశాలలో రమేష్ 4వ వర్ధంతిని ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రమేష్ సతీమణి విజయలక్ష్మి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రమేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రమేష్ ఉపాధ్యాయు సమస్యలపై పోరాటం చేస్తూనే ఉండేవారన్నారు. ఆయన భౌతికంగా లేకపోయినా ఆయన నింపిన ప్రేరణ స్ఫూర్తిదాయకం అన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ పూర్వపు రాష్ట్ర ప్రధానకార్యదర్శి కులశేఖర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్‌రఫీ, జిల్లా గౌరవాధ్యక్షుడు రామా నాయక్, అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి శ్రీనివాస్‌నాయక్, ఇతర నాయకులు అశోక్ నాయక్, హుస్సేన్ ఖాన్, లక్ష్మీనారాయణ, విజయభాస్కర్, రవీంద్ర, నాగేంద్ర పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

నాసిరకం ఎరువులు విక్రయిస్తే చర్యలు

గార్లదిన్నె, జూలై 16: దుకాణాల్లో రైతులకు నాసిరకమైన ఎరువులు, పురుగుల మందులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఏడీఏ రవి హెచ్చరించారు. మంగళవారం ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఏఓ సోమశేఖర్‌తో కలిసి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో ఎరువులు, మందుల స్టాక్ వివరాలు, రిజిస్టర్‌ను పరిశీలించారు. శ్రీ లక్ష్మీ ఫర్టిలైజర్, ఆగర్హా ఆగ్రో ఏజెన్సీ, మణిఖండన్ దుకాణాల్లో ప్రిన్సిపాల్ సర్టిఫికెట్ లేకపోవడంతోపాటు స్టాక్ బోర్డు, రిజిస్టర్ సరిగా నిర్వర్తించకపోవడంతో రూ. 1,02520 విలువ ఉన్న 75 లీటర్ల పెస్టిసైడ్స్, వెడ్‌సైడ్స్‌ను విక్రయించరాదని నోటీసులు జారీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

గార్లదిన్నె, జూలై 16: శింగనమల మండలం లోలూరు క్రాస్ వద్ద 44వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గార్లదిన్నెకు చెందిన ఆంజినేయులు, యర్రగుంట్లకు చెందిన కృష్ణారెడ్డి ద్విచక్ర వాహనంలో అనంతపురం నుంచి గార్లదిన్నె వెళుతున్నారు. అనంతపురం వైపు నుంచి గుత్తి వైపు వెళుతున్న గుర్తు తెలియన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొని వెళ్లిపోయింది. దీంతో అంజినేయులు, కృష్ణారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు కోసం పోలీసులు చర్యలు చేపట్టారు.

బాస్కెట్‌బాల్ క్రీడాకారుడికి సన్మానం



ద్వారకానాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న కలెక్టర్

అనంతపురం క్లాక్‌టవర్/టౌన్, జూలై 16: భారత బాస్కెట్‌బాల్ జట్టుకు ఎంపికైన జిల్లా క్రీడాకారుడు ద్వారకానాథ్‌రెడ్డిని మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్ సన్మానించారు. అంతర్జాతీయ పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బాస్కెట్ బాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హబీబుల్లా, నరేంద్రచౌదరి, డీఎస్‌డీఓ షఫీ, బాస్కెట్‌బాల్ కోచ్‌లు వంశీరెడ్డి, తల్లిదండ్రులు హరినాథ్‌రెడ్డి, చంద్రిక పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణ

స్పెయిన్ కోచ్‌ల బాస్కెట్‌బాల్ శిక్షణ బుధవారం నుంచి ప్రారంభించనున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హబీబుల్లా, నరేంద్రచౌదరి తెలిపారు. బుధవారం సాయంత్రం అశోక్‌నగర్ ఇండోర్‌స్టేడియంలో స్పెయిన్‌కోచ్‌లు శిక్షణ ప్రారంభిస్తారన్నారు. ఎస్ఎస్‌బీఎన్ కాలేజ్, ధర్మవరం, బుక్కరాయసముద్రం, మరూరు, నార్పల, ఏజీఎస్ స్కూల్, గుట్టూరు ప్రాంతాలలో శిక్షణ ఇస్తారన్నారు.

టమోటా కిలో రూ.63

అనంతపురం రూరల్, జూలై 16: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.45తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మంగళవారం 85టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.52, కనిష్ఠ ధర రూ.40 పలికినట్లు తెలిపారు.



పూజలు అందుకుంటున్న ఖాసీం స్వామి

వైభవంగా ఖాసీం స్వామి పెద్ద సరిగెత్తు

బత్తలపల్లి, జూలై 16: మండలకేంద్రంలో ఖాసీం స్వామి పెద్ద సరిగెత్తు వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. హిందువులు స్వామివారికి పానక దుత్తలు సమర్పించారు. ఈ వేడుకలకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

నిధులు కేటాయించండి: స్వామిదాస్



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న స్వామిదాస్

అనంతపురం అర్బన్, జూలై 16: క్రిస్టియన్ల సంక్షేమం కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని రాష్ట్ర అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్ కోరారు. మంగళవారం విజయవాడలోని సచివాలయంలోని మంత్రి చాంబర్‌లో వినతి పత్రం అందజేశారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు స్వామిదాస్ పేర్కొన్నారు.

బాక్సర్‌కు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్, జూలై 16: అంతర్జాతీయ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారిణి వందనకు 40వ డివిజన్ కార్పొరేటర్ లక్ష్మీరాయల్, ఆమె భర్త మధురాయల్ ఆర్థికసాయం అందజేశారు. భూటాన్‌లో ఈనెల 23 నుంచి జరగనున్న పోటీల్లో విడపనకల్లుకు చెందిన వందన పాల్గొననుంది. ఈ నేపథ్యంలో రూ. 10 వేలను వారు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి ఉన్నారు.

ఘనంగా పెద్దసరిగెత్తు



కనగానపల్లిలో కొలువుదీరిన పీర్లు

ధర్మవరంరూరల్(కనగానపల్లి), జూలై 16: మండలకేంద్రమైన కనగానపల్లిలో మొహరంలో భాగంగా పెద్దసరిగెత్తును మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. దస్తగిరి, వన్నూరుస్వామిలకు పానకాలు సమర్పించి చక్కెరచదివింపులు చదివించారు.

బుక్కరాయసముద్రం: మండలంలో మంగళవారం పెద్దసరిగెత్తు జరిగింది. ఈ సందర్భంగా పీర్లుకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి చక్కెర చదివింపులు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్లెనగారి శ్రీనివాసులు, టీడీపీ నాయకుడు పటేల్ బూషి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. బుధవారం ఉదయం అగ్నిగుండ ప్రవేశం, సాయంత్రం ఊరేగింపు, జలధి ఉంటాయని ఆలయ కమిటీ పేర్కొంది.

తొలి ఏకాదశికి ఏర్పాట్లు

చెన్నేకొత్తపల్లి, జూలై 16: మండల కేంద్ర పరిధిలోని కనుమ వెంకటేశ్వరస్వామి సన్నిధిలో తొలిఏకాదశి మహోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లను పూర్తిచేసినట్లు ఆలయ ట్రస్టు సభ్యులు తెలిపారు. 18న తెల్లవారుజామున 5 గంటలకు అభిషేకంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు శ్రీదేవి, భూదేవి సహిత వెంకటేశ్వర స్వామి కల్యాణమహోత్సవం ఉంటుందన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొననున్నారన్నారు. అందుకుతగ్గట్టుగా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. పూజల అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. అదేవిధంగా చెన్నేకొత్తపల్లిలో వెలసిన అహోబిళ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో తొలిఏకాదశి వేడుకలను నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

తొలి ఏకాదశి, మొహరం శుభాకాంక్షలు

ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం అర్బన్, జూలై 16: అనంతపురం అర్బన్ నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తొలి ఏకాదశి, మొహరం శుభాకాంక్షలు తెలిపారు. హిందువుల పండుగల్లో తొలి పండుగ తొలి ఏకాదశి అని అన్నారు. ప్రజలకు శుభాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. త్యాగనిరతికి, సహనానికి మొహరం ప్రతీక అన్నారు. ప్రజలు పోలీసుశాఖ సూచించిన నిబంధనల మేరకు శాంతియుత వాతావరణంలో మొహరం జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

ఘనంగా కుంటెమ్మ దేవత గ్రామోత్సవం


బోనాలు ఎత్తుకున్న మహిళలు

పెద్దవడుగూరు, జూలై 16: మండలకేంద్రంలో మంగళవారం కుంటెమ్మ దేవత గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలు అమ్మవారికి సమర్పించి పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రతియేటా బోనాలు సమర్పించడం ఆనవాయితీ అని భక్తులు తెలిపారు.

వెంకటేశ్వరాలయంలో కోయిల్ ఆళ్వార్ తిరమంజనం


స్వామి వారికి కర్పూర హారతి ఇస్తున్న భక్తులు

గుంతకల్లుటౌన్, జూలై 16: పట్టణంలోని రాజేంద్ర నగర్‌లో వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం ఆలయాన్ని పచ్చకర్పూరంతో శుద్ధి చేశారు. అనంతరం మూలవిరాటుకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీశైలం వెంకటేశ్వర్లు, కోశాధికారి గుండాసుధాకర్, సభ్యులు జయంతివెంకటే, సుదర్శన్‌బాబు, వేల్పూరిరవి, వీర, ప్రవీణ్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన మాజీ ఎమ్మెల్యే


మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జితేంద్రగౌడ్

గుంతకల్లుటౌన్, జూలై 16: విజయవాడలోని రాష్ట్ర సచివాలయంలో ఏపీ న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ ఫరూక్‌ను మంగళవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్ జితేంద్రగౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు రవిశంకర్‌గౌడ్, మాజీ ఎంపీపీ వీరభద్రయ్య, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కురుబ సురేష్, నాయకులు పరదేశి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

ఉరవకొండ, జూలై 16: పట్టణంలోని విశ్వాస్, లక్ష్మీ వెంకటేశ్వర గౌరి ఎరువుల దుకాణాలను ఏవో శుభకర్ మంగళవారం తనిఖీలు చేశారు. దుకాణాలలోని స్టాక్ వివరాలను, రికార్డులను పరిశీలించారు. అనుమతి పత్రాలు లేని కారణంగా రూ.67వేల విలువైన పురుగు మందులను అమ్మకుండా నిలుపుదల చేశారు.

పీర్ల చావిడికి గుమ్మనూరు సోదరుల వితరణ

గుంతకల్లు, జూలై 16: ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేరిట ఆయన సోదరులు గుమ్మనూరు శ్రీనివాసులు, నారాయణ స్వామి నక్కనదొడ్డిలోని పీర్లచావిడికి రూ. 5 లక్షల మొక్కును చెల్లించారు. మంగళవారం మధ్యాహ్నం నక్కనదొడ్డికి వెళ్లిన వారు పీర్ల చావిడిలో పూజలు చేశారు. అనంతరం తమ సోదరుడు ఎమ్మెల్యే జయరాం పేరిట రూ. 5 లక్షల నగదును విరాళంగా అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తిరూరల్, జూలై 16 : మండలంలోని శ్రీపురం గ్రామశివారులోని 67వ జాతీయ రహదారిపై మంగళవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో కంబయ్య అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గుత్తికి చెందిన కంబయ్య గుంతకల్లుకు వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంలో వస్తుండగా శ్రీపురం గ్రామశివారులో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. కంబయ్యకి తీవ్రం గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

పెళ్లి కాకనే ప్రసవం

డి.హీరేహాళ్, జూలై 16: మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ యువతి(22) పెళ్లి కాకుండానే బిడ్డకు జన్మనిచ్చింది. పురిటి నొప్పులతో బాధపడుతున్న యువతిని కుటుంబ సభ్యులు కాన్పు కోసం మంగళవారం రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న డి.హీరేహాళ్ ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, మహిళ, శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ ఈశ్వరీ రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి విచారించారు. తమ గ్రామానికే చెందిన తన క్లాస్‌మేట్‌ను ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి దగ్గరయ్యాడని ఆ యువతి వారికి తెలిపింది. తాను గర్భం దాల్చిన తరువాత పెళ్లి విషయమై పలుమార్లు ప్రస్తావించానని, త్వరలోనే చేసుకుంటానని చెప్పి, కొన్ని రోజులుగా కనిపించడం లేదని తెలిపింది. తమ కూతురికి అతడితో వివాహం జరిపించాలని యువతి తల్లిదండ్రులు పోలీసులకు విన్నవించారు. విచారించి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

క్రమ శిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ


ర్యాంకులు పొందిన ఎన్‌సీసీ వలంటీర్లతో ప్రిన్సిపాల్

గుంతకల్లుటౌన్, జూలై 16: విద్యార్థులకు చదువుతో పాటు, క్రమ శిక్షణకు ఎన్‌సీసీ ఎంతో తోడ్పాటు ఇస్తుందని శ్రీ శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాలప్రిన్సిపాల్ పీ గోపాల్ పేర్కొన్నారు. స్థానిక కళాశాలలో మంగళవారం ఎన్‌సీసీ క్యాడెట్ల విద్యార్థులకు ర్యాంకుల ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యాడెట్ సీనియర్ అండర్ అధికారిగా మనోజ్‌కు మార్, జూనియర్ అండర్ అధికారిగా అజయ్, ర్యాంక్ మాస్టర్ సార్జంట్‌లుగా పవన్‌కుమార్, దివాకర్, భవాని, ప్రసాద్‌కు ర్యాంక్‌లను ప్రదానం చేశారు.

బోగస్ సర్టిఫికెట్లతో పింఛన్ లబ్ధిపై విచారణ

యాడికి, జూలై 16: బోగస్ సర్టిఫికెట్లతో పింఛన్ పొందుతున్నారనే ఫిర్యాదుతో వెంగన్నపల్లి గ్రామంలో పలువురు లబ్ధిదారులను మంగళవారం అధికారులు విచారించారు. వెంగన్నపల్లిలో పలువురు బోగస్ సర్టిఫికెట్‌లతో పెన్షన్ పొందుతున్నారని వారంరోజులక్రితం గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదుచేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఎంపీడీఓ సావిత్రి, ఈఓపీఆర్‌డీ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి వసుందరలు గ్రామానికి వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. దీనిపై నివేదికను తయారుచేసి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు వారు తెలిపారు.


రాయదుర్గం పట్టణంలో పానకాల ఊరేగింపు


పీర్ల చావిడిలో చక్కెర చదివింపులు నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా మొహరం

రాయదుర్గం/రాయదుర్గం రూరల్, జూలై 16: మొహరం వేడుకలను మంగళవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఉచ్చుబాయి. లద్దువారి, చమ్మా, ఊరువాకిలి, గొందిబావి తదితర ప్రాంతాల్లో పీర్ల చావిడిల వద్ద పెద్ద సరిగెత్తులో భాగంగా పానకాల ఊరేగింపు నిర్వహించారు. భక్తులు వందలాదిగా తరలివచ్చి పీర్లకు చక్కెర చదివింపులు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ ఉచ్చుబాయి పీర్లను దర్శించుకున్నారు. అలాగే మండలంలోని జుంజరంపల్లి, అర్‌బీవంక, కొండాపూరం, టీ వీరా పురం, కొంతానపల్లి, మల్లాపూరం, ఆవులదట్ల, వజ్రవన్నూరు, కదరంపల్లి, రేకులకుంట, మల్కాపురం, పల్లేపల్లి, చదం తదితర గ్రామాల్లో పెద్ద సరిగెత్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం పీర్ల జలధి నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.


ఉచ్చుబాయి పీర్లను దర్శించుకున్న కాలవ భరత్

యాడికి: మండలకేంద్రంలోని పీర్ల చావిడిల వద్ద పెద్దసరిగెత్తు కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. చక్కెర చదివింపులు చేశారు. అగ్నిగుండాలు వెలిగించారు. యాడికి, రాయలచెరువు, రామరాజుపల్లి, వేములపాడు, చందన తదితర గ్రామాల్లో పెద్దసరిగెత్తును నిర్వహించారు.


టి.వీరాపురం గ్రామంలో చక్కెర చదివిస్తున్న భక్తులు


యాడికిలో కొలువుదీరిన పీర్లు

పార్టీలకతీతంగా అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే శ్రావణిశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

పుట్లూరు, జూలై 16: పార్టీలకు అతీతంగా మండలాన్ని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గడిచిన ఐదేళ్లలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు ఎలాంటి అభివృద్ధి నిధులు లేవని, వచ్చే ఐదేళ్లలో కలిసికట్టుగా మండలాన్ని అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. మండలంలో ఏ నాయకుడికి, అధికారికి భయపడకుండా సమస్యలు ఉంటే తెలపాలని స్థానిక ప్రజాప్రతినిధులకు సూచించారు. మండలంలోని మడుగుపల్లి పంచాయతీలో సిమెంట్‌రోడ్డుకు 2022లో జ డ్పీ నిధులు రూ.5లక్షలు మంజూరయ్యాయని, అయితే అక్కడ రోడ్డు లేదని ఎమ్మెల్యే అధికారులపై ఆగ్రహించారు. దీనిపై పీఆర్ ఇంజినీర్ యల్లమనాయుడు మాట్లాడుతూ వచ్చిన నిధులను అలాగే ఉంచామని చెప్ప గా... ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆ నిధులను ఏమిచేయాలనుకున్నారో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. మండలవ్యాప్తంగా తారురోడ్లు, సిమెంట్ రోడ్లు లేని గ్రామాల జాబితాను తనకు ఇవ్వాలన్నారు. స్థానిక ప్రజా ప్ర తినిధులు, అధికారుల పరిధిలో ఎలాంటి సమస్య వచ్చినా తనకు ఫిర్యాదు చేయాలన్నారు. అంతకుమునుపు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో ఆమె మొక్కలు నాటారు. పర్యావరణాన్ని కాపాడాలని ఆమె పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణమంతా పరిశుభ్రంగా ఉంచాలి

ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి


మార్కెట్ సమీపంలో కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

తాడిపత్రి, జూలై 16: పట్టణంలో ఎక్కడా చెత్తా చెదారం కనిపించకూడదని, పరిశుభ్రంగా ఉండాలని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని పుట్లూరురోడ్డు, యల్లనూరురోడ్డు బస్టాండ్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. యల్లనూరురోడ్డు, బస్టాండ్ ప్రాంతాల్లో ఉన్న సైడ్‌కాలువలను పరిశీలించారు. వర్షాకాలం కావడంతో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా మురుగు కాలువల్లో ఎప్పటికప్పుడు పూడికతీత పనులు చేపట్టాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్, డీఈ వెంకటసుబ్బయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో పాటు టీడీపీ నాయకులు విజయ్‌కుమార్, పవన్‌కుమార్‌రెడ్డి, ఖాదర్, రామచంద్ర, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఓపీఎస్ అమలుచేయాలి: ఉపాధ్యాయులు

తాడిపత్రి: పాత పెన్షన్ విధానాన్ని అమలుచేసి తమకు న్యా యం చేయాలని డీఎస్సీ 2003కు చెందిన పలువురు ఉపాధ్యాయులు మంగళవారం ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. పాత పెన్షన్ పునరుద్ధరణకు అవకాశం ఉన్న తమకు న్యాయం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యేను కోరామన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉపాధ్యాయులు డేనియల్, హాజివలి, ఓబయ్య, అంకాల్, మల్లికార్జునరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన వాలీబాల్ క్రీడాకారుడు

తాడిపత్రి: ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డిని పట్టణంలోని ఆయన నివాసంలో బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు ద్వారకానాథ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. మూడురోజుల క్రితం శ్రీలంకలో జరిగిన పోటీల్లో రాష్ట్రం తరఫున ఆడి గెలుపొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రీడాకారుడిని అభినందించారు.

మహిళల స్వయం సాధికారతే లక్ష్యం: పీడీ

కళ్యాణదుర్గం రూరల్, జూలై 16: మహిళల స్వయంకృత సాధికారతే లక్ష్యంగా శక్తి సదన్ కృషి చేస్తుందని ఐసీడీఎస్ పీడీ డాక్టర్ బీఎన్ శ్రీదేవి తెలిపారు. పట్టణంలోని శ్రీవివేకానంద జూనియర్ డిగ్రీ కళాశాలు ఎడ్యుకేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారంనిర్వహించిన మిషన్ శక్తిసదన్ కార్యక్రమానికి ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళల కోసం బాలల హక్కులు, మహిళల శక్తిసదన్ సేవలు అనే అంశంపై సమావేశం నిర్వహించారు. అధికారులతో పాటు యువత కూడా తమ వంతుగా బాల్యవివాహాలను అరికట్టడంలో ముందుకు వచ్చి సహకరించాలని పీడీ కోరారు. కార్యక్రమంలో రూరల్ సీఐ నాగరాజు, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 జిల్లా సమన్వయకర్త కృష్ణమాచారి, సఖి వన్ స్టాప్ సెంటర్ అడ్మిన్ శాంతామణి, లీగల్ కౌన్సిల్ గృహహింస విభా గం నర్మదా, శక్తిసదన్ సూపరింటెండెంట్ శ్యామల, శక్తి సదన్, డైరెక్టర్ నాగరాజు, జూనియర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

లబ్ధిదారులందరికీ రేషన్ బియ్యం : తహసీల్దార్

యాడికి, జూలై 16: రేషన్ లబ్ధిదారులు ప్రతి ఒక్కరికి రేషన్ బియ్యం పంపిణీ అందిస్తామని తహసీల్దార్ మోహనవల్లి తెలిపారు. 'రేషన్ దుకాణానికి తాళం' శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దార్ పిన్నేపల్లిలోని రేషన్ దుకాణాన్ని పరిశీలించారు. రేషన్ లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ లబ్ధిదారులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని ప్రతి ఒక్కరికి బియ్యాన్ని అందిస్తామని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యేకి వినతి

పుట్లూరు: గతేడాది ఇన్‌పుట్ సబ్సిడీ రాని రైతులకు న్యాయం చేయాలని రైతు సంఘం మండల నాయకుడు రామాంజనేయులు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి మంగళవారం వినతిపత్రం అందజేశారు. గతేడాది వైసీపీ ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించినా దాదాపు 117మంది రైతుల ఖాతాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ నిధులు జమకాలేదన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో బాలగుర్రయ్య, గోపాల్ తదితరులు ఉన్నారు.

కొనసాగిన ఏసీబీ అధికారుల విచారణ

ఏసీబీకి చిక్కిన తహసీల్దారుకు గుంతకల్లులో వైద్య పరీక్షలు


వైద్య పరీక్షల కోసం తహసీల్దార్‌ను తీసుకెళ్తున్న ఏసీబీ అధికారులు

ఉరవకొండ/ గుంతకల్లు టౌన్, జూలై 16: భూమికి సంబంధించిన మ్యుటేషన్ కోసం రూ. 65వేలు లంచం తీసుకుంటూ వజ్రకరూరు మండల తహసీల్దార్ మహమ్మద్‌రఫీ సోమవారం ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం విదితమే. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకూ ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. రైతు ఆదినారాయణ రెడ్డిని తహసీల్దారు కార్యాలయానికి పిలిపించి రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మల్లికార్జున అనే రైతు నుంచి వివరాలను ఆరా తీశారు. ఈ కేసులోని మొదటి నిందితుడైన తహసీల్దారు మహమ్మద్‌రఫీని, ఏ2 అయిన తహసీల్దారు సమీప బంధువు ఇద్రుష్‌ను ఏసీబీ అధికారులు రిమాండ్‌కు తరలించే ముందు వైద్య పరీక్షల కోసం వాహనంలో గుంతకల్లుకు తీసుకొచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరిండెంటెంట్ డాక్టర్ జయవర్ధన్ రెడ్డి ఈ ఇరువురికి బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించారు. అనంతరం ఏసీబీ అధికారులు తమ వాహనంలో ఇరువురిని కర్నూలుకు తరలించారు.

నేమకల్లు వద్ద పంట పొలాల పరిశీలన

బొమ్మనహాళ్, జూలై 16: మండలంలోని నేమకల్లు గ్రామశివారులో పంట పొలాలను స్థానిక తహసీల్దార్ రామాంజినమ్మ మంగళవారం పరిశీలించారు. నేమకల్లు గ్రామం వద్ద ఉన్న స్పాంజ్ ఐరన్ కర్మాగారాల నుంచి వస్తున్న పొల్యూషన్‌తో పంట పొలాలు దెబ్బతింటున్నాయని, రైతులకు రావాల్సిన పంట నష్టపరిహారం అరకొరగా ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని సీపీఐ నాయకులు సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ కర్మాగారం నుంచి వచ్చే కాలుష్యాన్ని, అక్కడ నష్టపోతున్న పంటలను పరిశీలించారు. కలెక్టర్‌కు నివేదిక పంపిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ రవితేజ, ఆర్ఐ బాలకృష్ణ, వీఆర్వో తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

'ఆశావర్కర్ పోస్టును లాక్కున్నారు'

బొమ్మనహాళ్, జూలై 16: దాదాపు 15 సంవత్సరాలుగా ఆశావర్కర్‌గా పనిచేసిన తనను తొలగించి రూ. రెండు లక్షలు తీసుకొని వేరే అమ్మాయికి కట్టబెట్టారని జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేసినట్లు మండలంలోని లింగదహాళ్ గ్రామానికి చెందిన నాగవేణి తెలిపారు. ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ... 2008 నుండి 2022 వరకు శ్రీధరఘట్ట ప్రాథమిక వైద్యశాల పరిధిలోని లింగదహాళ్ గ్రామంలో ఆశావర్కర్‌గా పని చేశానన్నారు. వైద్యాధికారి తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వైసీపీ నాయకుల ప్రోద్బలంతో తనను తొలగించి వేరే వాళ్లను నియమించారని ఆరోపించారు. ఆశవర్కర్‌గా పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాని తనకు న్యాయం జరుగలేదన్నారు. ఆశావర్కర్ పోస్టును తిరిగి నాకు ఇప్పించాలని కోరారు. ఈ విషయంపై వైద్యాధికారి కుమార్‌రాజాను వివరణ కోరగా నేను బాధ్యతలు తీసుకునే సమయానికే లింగదహాళ్ ఆశావర్కర్ పోస్టుతో పాటు మరికొన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

రెండు విధులు ఒకేసారి..!

అంగన్‌వాడీ ఆయాపై ఐసీడీఎస్ విచారణ

యాడికి, జూలై 16: ఆమె అంగన్‌వాడీ ఆయాగా పనిచేస్తోంది... అదే సమ యంలో ఉపాధి పనులకు కూలీగా వెళ్లింది. ఇదెక్కడి చోద్యం అంటూ ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో మంగళవారం ఐసీడీఎస్ అధికారులు మండలంలోని వెంగన్నపల్లి కి వెళ్లి విచారణ చేశారు. వెంగన్నపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో లాలెమ్మ అనే మహిళ ఆయాగా విధులు నిర్వర్తిస్తోంది. ఈ ఏడాది మేనెలలో అంగన్‌వాడీ కేంద్రంలో లాలెమ్మ విధుల్లో ఉంది. అదే సమయంలో ఆమె ఉపాధిహామి పనులకు వెళ్లినట్లు వారం రోజులక్రితం గ్రామస్థులు ఐసీడీఎస్ అధికారులకు ఆధారాలతోఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయకుమారి, దస్తగిరమ్మ, లక్ష్మీదేవి విచారణ నిమిత్తం వెంగన్నపల్లికి వచ్చారు. సర్పంచు పార్వతమ్మ, ఉప సర్పంచు నాగమునిరెడ్డి, గ్రామస్థుల ఆధ్వర్యంలో విచారణ చేశారు. దీనిపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారిని వివరణ కోరగా లాలెమ్మ ఉపాధి పనులకు వెళ్లినట్లు గ్రామస్థులు ఆధారాలు సమర్పించారని తెలిపారు. ఆయాను, గ్రామస్థులను విచారించామని, నివేదికను తయారుచేసి పీడీకు అందజేయనున్నట్లు తెలిపారు.


విచారణ చేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

కొలువుదీరిన పీర్లు


కణేకల్లు మండలం హనుమాపురంలో కొలువుదీరిన లాలూస్వామి పీర్లు

కణేకల్లు, జూలై 16: మండలంలోని హనుమాపురం గ్రామంలో ప్రసిద్ధి చెందిన లాలూస్వామి పీర్ల మకాన్‌లో పెద్ద సరిగెత్తును మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేల మంది భక్తులు తరలివచ్చి పీర్లను దర్శించుకుని చక్కెర చదివింపులు చేశారు. అలాగే మండల కేంద్రంలోని వివిధ మకాన్‌లలో కొలువుదీరిని పీర్ల జలధిని బుధవారం నిర్వహించనున్నారు.


బొమ్మనహాళ్‌లో..

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్, బొమ్మనహాళ్, బండూరు, కొళగానహళ్లి, ఏళం జి, కానాపురం, దర్గాహోన్నూరు, కల్లహోళ తదితర గ్రామాల్లో పీర్ల చావిడిల్లో కొలువు దీరిన పీర్లకు చక్కెర చదివింపులు చేసి, పెద్ద సరిగెత్తు నిర్వహించారు. పీర్లచావిడి ఎదుట అగ్నిగుండం వెలిగించారు. బుధవారం జలధి నిర్వహించనున్నారు.

గుమ్మఘట్ట: మండలంలోని నేత్రపల్లి, బేలోడు తదితర గ్రామాల్లో మంగళవారం పీర్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రార్థనలు చేశారు. భక్తులు భారీ ఎత్తున పానకాలతో పీర్లను దర్శించుకున్నారు. అగ్నిగుండం చుట్టూ తిరిగారు. బెల్లం, చక్కెర తులాభారంతో మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం


నేత్రపల్లిలో పీర్లను దర్శించుకుంటున్న భక్తులు


ఉరవకొండలో పానకాలు తీసుకెళ్తున్న భక్తులు, (ఇన్‌సెట్‌లో) కొలువుదీరిన పీర్లు

ఉరవకొండ: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లోని చావిళ్లలో పీర్లు కొలువుదీరాయి. భక్తులు మంగళవారం సాయంత్రం పానకాలు, చక్కెరను ఊరే గింపుగా తీసుకెళ్లారు. పీర్లకు చక్కెర చదివింపులు చేశారు. అలాగే వజ్రకరూరు మండ లంలో భక్తులు పానకాలు తీసుకెళ్లారు. చక్కెర చదివింపులు, తులాభారం నిర్వహించారు.


పెద్దవడుగూరులో కొలువుదీరిన పీర్లు

పెద్దవడుగూరు: మండలవ్యాప్తంగా మంగళవారం పెద్దసరిగెత్తు వేడుకలు ఘనంగా జరిగాయి. చావిళ్లలో కొలువుదీరిన పీర్లను భక్తులు సందర్శించి చక్కెర చదివింపులు చేశారు. ఎస్ఐ రెడ్డప్ప ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు చేపట్టారు.

యల్లనూరు: మండలకేంద్రంలోని పిల్లఖాశిం, కోటవీధి, పాతపేటలోని పీర్లచావిళ్ల వద్ద మంగళవారం అగ్నిగుండాలు వెలిగించారు. మంగళవారం తెల్లవారుజామున పాతపేటలోని దస్తగిరి పీరును ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి చక్కెర చదివింపులు చేశారు.


పెద్దొడ్డిలో పీర్లను దర్శించుకుంటున్న గుమ్మనూరు నారాయణ

గుత్తి రూరల్: మండలంలోని పెదొడ్డి, గాజులపల్లి, ఇసురాళ్లపలి, కరిడికొండ, అబ్బేదొడ్డి, బసినేపల్లి, మార్నేంపల్లి, యర్రగుడి, బసినేపల్లి తదితర గ్రామాల్లో మంగళ వారం ఘనంగా పెద్ద సరిగెత్తు నిర్వహించారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణ ఆయా గ్రామాల్లో పీర్లను దర్శించుకుని చక్కెర చదివింపులు చేశారు. భక్తులు చక్కెర చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు.


గుత్తిలో అలంకరణలో బారే ఇమామ్ పీర్లు

గుత్తి: పట్టణంలో పెద్ద సరిగెత్తు కార్యక్ర మాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. బారే ఇమామ్, పగ్గాలపీరు, బొడ్డుపీరు మకాన్‌లలో పీర్లను నిర్వాహకులు ప్రత్యేకంగా అలంకరించారు. మకాన్‌లను విద్యుత్ దీపాలతో అలంకరించా రు. బారే ఇమామ్ వద్ద భక్తులు పెద్ద ఎత్తున మొక్కులు తీర్చుకున్నారు. బండగేరి వీధి నుంచి కాలనీ వాసులు పానకాలను ఊరేగింపుగా బారే ఇమామ్‌కు సమర్పించారు.


ఉదిరిపికొండ గ్రామంలో కొలువుదీరిన పీర్లు

కూడేరు : మండలకేంద్రమైన కూడేరుతో పాటు ఉదిరిపికొండ, కమ్మూరు, ఇప్పేరు, జల్లిపల్లి, ఉదిరిపికొండ తండా, శివరాంపేట గ్రామాల్లో పెద్ద సరిగెత్తును మంగళవారం ఘనంగా నిర్వహించా. భక్తులు పానకాలను ఊరేగింపుగా తీసుకెళ్లి పీర్లకు సమర్పించారు. పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.


ఎర్రగుడిలో..

బెళుగుప్ప : మండలంలో మొహరం వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. బెళు గుప్పలో పీర్లను జల దికి తరలించగా... ఎర్రగుడి, శీర్పి, కోణంపల్లి, విరుపాపల్లి గ్రామాల్లో పానకాలు సమర్పణ, చక్కెర చదివింపులతో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఎస్ఐ శివ తమ సిబ్బందితో గట్టి బందోబస్తు చేపట్టారు.


బెళుగుప్పలో పీర్లను జలధికి తీసుకెళ్తున్న దృశ్యం

జక్కలవడికిలో రెండు వర్గాల వివాదం

కణేకల్లు, జూలై 16: మొహరం సందర్భంగా మండలంలోని జక్కలవడికి గ్రామంలో రెండు వర్గా మధ్య వివాదం రాజుకుంది. పెద్ద సరిగెత్తు సందర్భంగా మంగళవారం ఓ వర్గం వారు గ్రామ పెద్దల నిబంధనలకు వ్యతిరేకంగా టపాసులు పేల్చుతూ పానకాలు తీసుకొ స్తుండడాన్ని మరో వర్గం వారు అడ్డుకున్నారు. దీంతో అక్కడ కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. వివాదం ఎక్కువ కావడంతో కణేకల్లు ఏఎస్ఐ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇరు వర్గా లకు పోలీసులు నచ్చజెబుతున్నప్పటికీ ఓ వర్గం అగ్నిగుండంపై వెలిగించకుండా నిరసనను తెలియజేశారు. రాత్రి 9.30 అయిన వివాదం సద్దుమణగలేదు.